క్లుప్తంగా

పశ్చిమడెల్టాకు ఆరువేల క్యూసెక్కుల నీటి విడుదల



నిడదవోలు వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను పెంచారు. మండలంలోని విజ్జేశ్వరం హెడ్‌స్లూయిస్ నుంచి ఆదివారం 6,000 క్యూసెక్కుల గోదావరి జలాలను కాలువలకు విడుదల చేశారు. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలకు కూడా నీటి విడుదలను అధికారులు పెంచారు. నరసాపురం కాలువకు 1912 క్యూసెక్కులు, తణుకు కాలువకు 830, ఏలూరు కాలువకు 940, ఉండి కాలువకు 1319, అత్తిలి కాలువకు 412 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,50,584 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

నిడదవోలు: రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల కోసం పట్టణంలోని రైల్వేగేట్ వద్ద రహదారి మూసివేసిన కారణంగా రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే బస్సులను సోమవారం ఉదయం నుంచి దారి మళ్లించినట్లు ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. నిడదవోలు, కోరుమామిడి, అప్పారావుపేట, మాధవరం, నవాబుపాలెం, ప్రత్తిపాడు మీదుగా తాడేపల్లిగూడెం చేరుకుంటాయి. నిడదవోలు డిపో నుంచి ఉదయం నుంచి తాడేపల్లిగూడెం సర్వీసులను రాత్రి 9 గంటల వరకు నడుపుతున్నట్లు డీఎం పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

గోపాలపురం: గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గుడ్డిగూడెం పరిధిలోని ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం 24వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న తొక్కిరెడ్డిగూడెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, బుచ్చియ్యపాలెం వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుడికి తల్లిదండ్రుల సత్కారం



రాగోలపల్లిలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన డి.దుర్గారావును సత్కరిస్తున్న తల్లిదండ్రులు

తాళ్లపూడి: రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళ్తున్న డి.దుర్గారావును గ్రామస్తులు, విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామంలోని బెరకా మందిరం (చర్చిలో) శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల అభివృద్ధికి చేపట్టిన పనులను పలువురు పాఠశాల సిబ్బంది కొనియాడారు. ఆయన స్వగ్రామం పైడిమెట్ట ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 45 రోజులుగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న తమను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు, పెద్దలతో నిరసన ప్రదర్శన నిర్వహించి గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ భర్తలకు నెలకు రూ.15 వేలు జీతం అని రూ.2 వేలు కటింగులు పోను రూ.13 వేలు చేతికి ఇస్తారని ఆ మొత్తాన్ని ఇంటి అద్దె, విద్యుత్ బిల్లు, నిత్యావసరాలు, పిల్లల చదువులకు సర్దలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అప్పుడే తమ బతుకులు బాగు పడతాయన్నారు.

వందనానికి నిబంధనాలు

- 4,060 మంది తల్లులకు నిలుపుదల
- నిబంధనల పేరుతో ఆంక్షలు
- సచివాలయాలు, అధికారుల చుట్టూ పడిగాపులు

తాళ్లపూడి: ఎన్నో ఆశలతో ఎదురు చూసిన 'తల్లికి వందనం' వస్తుందని ఎదురు చూసిన కొందరు తలులకు వంద నిబంధనల రూపంలో నిరాశే మిగిలింది. నిబంధనల పేరుతో కొందరు తల్లులకి కూటమి పథకాన్ని దూరం చేసింది. సగటు విద్యుత్ వినియోగం 300 యూనిట్లు కంటే ఎక్కువ ఉందన్న కారణంతో అర్హత ఉన్న వారు సైతం పథకం సొమ్ములు పడకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 4,060 మందికి అనర్హత కారణంగా పథకం సొమ్ములు జమకాలేదు. పట్టణంలో 3,632 మంది అర్హత పొందారు, 1,250 మంది అనర్హత జాబితాలో ఉన్నారు. కొవ్వూరు మండలంలో 7,368 మంది అర్హత సాధించగా 1,154 మంది అనర్హత కారణంగా డబ్బులు పడలేదు. తాళ్లపూడి మండలంలో 5,978 అర్హత సాధించగా 885 మందికి అనర్హులుగా నిలిపివేసారు. చాగల్లు మండలంలో 4,577 మంది లబ్ధిదారులు ఉండగా 771 మందిని అనర్హత కారణంగా వందనం పథకానికి దూరమయ్యారు. అయితే ఇందులో వాస్తవంగా అధిక శాతం మంది కరెంట్ వాడక పోయిన 300 కంటే ఎక్కవ అని చూపారు. కొందరికి సింగిల్ ఎల్‌పీఎం నెంబర్ కాణంగా కూడా సొమ్ములు పడలేదు. మరికొందరు 12 వేలు ఆదాయం చూపడంతో వేయలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యను ప్రోత్సహించడం కోసం, డ్రాప్ అవుట్ రేటును తగ్గించడమే లక్ష్యంగా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం తల్లుల మనస్సులను గెలుచుకుంది. దీంతో కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం పాఠశాల విద్యార్థుల తల్లులకు ఏటా రూ.15,000 ఆర్థిక సాయం ఎంత మంది పిల్లలు ఉన్నా అందజేస్తామని చెప్పారు. ఈ పథకం కింద ప్రస్తుతం రూ.13,000 తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన రూ.2,000 పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు చెప్పి కోత పెట్టారు.



తాళ్లపూడి మండలంలోని ఓ సచివాలయం వద్ద జాబితాలో పేరు చెక్ చేసుకుంటున్న ఓ తల్లి

నిబంధనలు, ఆంక్షలు

గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ ఆదాయం రూ.10,000, పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 మించకూడదు. ఈ లెక్కన గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు రూ.333, పట్టణాల్లో రూ.400 ఆదాయం మించితే పథకం అందదు. కానీ కూలి పనులకు వెళ్లే కూలీలు రోజుకు రూ.500 అంతకంటే ఎక్కువ సంపాదిస్తారు. దీనివల్ల చిన్నపాటి ఉద్యోగులు, చాలా పేద కుటుంబాలు అనర్హులుగా మారుతున్నాయి.

ఆస్తి పరిమితులు

మాగాణి 3 ఎకరాలు, మెట్ట భూమి 10 ఎకరాలు, లేదా పట్టణ ప్రాంతాల్లో 1,000 చ.అడుగుల స్థలం మించకూడదు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు.



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

పిడుగులా మారిన విద్యుత్ వినియోగం

నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదు. ఈ నిబంధనలతో పేద మధ్యతరగతి ప్రజలు ఈ పథకానికి ఎక్కువ శాతం దూరమయ్యారు. ముఖ్యంగా ఒక కుటుంబంలో రెండు విద్యుత్ మీటర్లు ఉంటే రెండు మీటర్ల యూనిట్లు సరాసరి లెక్క కట్టి పథకానికి దూరం చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. కొందరు అయితే సగటు విద్యుత్ 300 యూనిట్లు వినియోగించక పోయిన కూడా సగటు కంటే ఎక్కువ వినియోగించారనే నేపంతో అనర్హత జాబితాలో పెట్టారని తల్లులు వాపోతున్నారు.

ద్వంద్వ వైఖరి

దీంతో ఆయా తల్లులు నిత్యం సచివాలయాల, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ నిబంధనల పెట్టమని చెప్పి, నాడు విమర్శించి నేడు ఇప్పుడు మళ్లీ అదే నిబంధనలు పెట్టడం ఎంటని ప్రశ్నిస్తున్నారు. చిన్న ఇళ్లు ఉండి అద్దెకు ఇచ్చిన వారు ఈ పథకానికి దూరం అవుతున్నారు. ఈ నిబంధనలు సడలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు నిబంధనలు, తిరస్కరణలపై గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అర్హత సాధిస్తే వచ్చే నెల 5న వేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఇవి తప్పనిసరి

విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలి. తల్లి బ్యాంకు ఖాతా ఆధార్‌తో ఎన్‌పీసీఐతో లింక్ అయి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపకార వేతనాలు లేదా ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే వారు అనర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌లను పొందుతున్న వారు ఉన్నారు. వారిని తల్లికి వందనం పథకం నుంచి మినహాయించినట్టు చెబుతున్నారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు శిక్షగా మారుతోందని అంటున్నారు. తల్లికి వందనం పథకంలో ప్రభుత్వం నిబంధనలు సడలించి అందజేయాలని పలువురు కోరుతున్నారు.

ముగ్గురు పిల్లలకు పడలేదు



మాకు ముగ్గురు పిల్లలు పెదబాబు కార్తీక్ ఇంటర్ ఫస్టియర్, రెండో బాబు హర్ష పదో తరగతి, మూడో బాబు అక్షయ్ 8వ తరగతి చదువుతున్నారు. సగటు విద్యుత్ వినియోగం 300 దాటిందని అనర్హులుగా గుర్తించారు. మేము అంతా విద్యుత్ వినియోగించలేదు. అయినా పథకం కింద సొమ్ములు జమ కాలేదు.

– ఆదాడి లక్ష్మి, గజ్జరం

విద్యుత్ వినియోగం ఎక్కువని వచ్చింది



సగటు విద్యుత్ 300 యూనిట్లు వినియోగించక పోయిన, 300 యూనిట్లు కంటే ఎక్కువ ఉంది. నిబంధనలతో అనర్హత జాబితాలో పెట్టారు. మేము అంతా వినియోగించలేదు. సచివాలయంలో గ్రీవెన్స్ పెట్టాం. ఒక బాబు 10 తరగతి పూర్తయింది. మరో బాబు 9, పాప 5వ తరగతి, మా పిల్లలకు తల్లికి వందనం వచ్చేలా చేయాలి.

– పల్లికొండ అరుణకుమారి, గజ్జరం

అర్హత ఉన్న వారికి పథకం వచ్చేలా చర్యలు



అర్హత ఉన్న లబ్ధిదారులకు పథకం కచ్చితంగా అందిస్తాం. ఇప్పటికే సచివాలయల్లో అర్హుల జాబితా, అనర్హుల జాబితాను తయారు చేశారు. అనర్హత కారణాలు కూడా అందులో పొందుపరిచారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి గ్రీవెన్స్ తీసుకుని ఆన్‌లైన్ చేస్తాం. మళ్లీ రెండవ దఫా అర్హుల జాబితాను ప్రభుత్వం ప్రకటిస్తోంది.

– టీవీ వెంకట రమణ, ఎంపీడీవో, కొవ్వూరు మండలం

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

పెరవలి: ప్రజాప్రతినిధుల అలసత్వమో, అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ రూ.లక్షలు విలువైన షాపింగ్ కాంప్లెక్స్ రూపాయి ఆదాయం రాకుండానే దశాబ్దాల తరబడి మూతపడింది. గదులు లేక నానా అవస్థలు పడుతుంటే ఆదాయం కోసం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన పెరవలిలో 1996లో జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించి నిడదవోలు–నర్సాపురం ఆర్ అండ్‌బీ రహదారి పక్కన జిల్లా పరిషత్ స్థలంలో దీనిని నిర్మించారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు కేటాయింపు స్థానిక ఎస్సీ, ఎస్టీలకే ఇవ్వాలని జిల్లా పరిషత్ అధికారులు నిర్ణయించడం దీనికి స్థానిక పంచాయితీ లబ్ధిదారులను ఎంపిక చేసి తీర్మానం పంపించాలని ఆదేశించింది. ఆరు గదులు కలిగిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ లబ్ధిదారుల ఎంపిక చేసి తీర్మానం పంపించిన అనంతరం స్థానిక నాయకుల ఆధిపత్యం కోసం లబ్ధిదారుల లిస్టులో పేర్లు తారుమారు చేసి తరువాత పంపించారు. దీంతో మొదటి లబ్ధిదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గదుల కేటాయింపు నిలిచిపోయింది. ఏడాది పాటు ఇరువర్గాల వాదనలు విన్న తరువాత మొదటి లబ్ధిదారులకే గదుల కేటాయింపు చేసి వారి వద్ద నుంచి అద్దె వసూలు చేయడం ప్రారంభించారు. ఇందులో ప్రారంభించిన వ్యాపారాలు లాభసాటిగా లేకపోవడంతో మరొకరికి అద్దెకు ఇచ్చారని ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. దీంతో సమస్య మరలా మొదటికి రావడంతో ఆ షాపులకు తాళాలు వేశారు. పదిహేనేళ్ల క్రితం వేసిన తాళాలు నేటికీ అలాగే ఉండటంతో గృహాలు లేని కొందరు వీటిని ఆక్రమించుకుని నివాసాలు ఉంటున్నారు. దీంతో లక్షలాది రూపాయలు విలువ కలిగిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. ఈ షాపింగ్ కాంప్లెక్స్ గురించి గతంలో ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగానే ఉండిపోయింది. పెరవలిలో నేడు వ్యాపార సంస్థలకు గదులు కావాలంటే రూ.లక్ష అడ్వాన్సుతో పాటు నెలకి రూ.3 నుంచి రూ.5 వేలు అద్దె తీసుకుంటున్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తే ప్రతి నెలా రూ.వేలు ఆదాయం సమకూరుతుందని స్థానికులు వాపోతున్నారు.



పెరవలిలో నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు లయన్స్ క్లబ్ 2025–2026 నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకొన్నట్లు ఆదివారం లయన్స్ ప్రతినిధులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడిగా పెనుమాక జయరాజు, కార్యదర్శిగా యాగంటి చలపతిరావు, కోశాధికారిగా పాలడుగుల లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడిగా మద్దిపాటి సత్యనారాయణ, జాయింట్ కార్యదర్శిగా నాళం వీరవెంకట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పిల్లలమర్రి సర్వేశ్వరరావు, ఎండీ హరూస్సేన్, గూడపాటి వెంకట సత్య శివ ప్రసాద్, మెంబర్ షిప్ చైర్‌పర్సన్‌గా నామన బుల్లిరాజు, ఎల్‌సీఐఎఫ్ చైర్‌పర్సన్‌గా మద్దిపాటి వీరవెంకట సత్యానరాయణ, క్లబ్ అడ్మిస్ట్రేటర్‌గా పాలెంపాటి చినబాబు చౌదరి, సర్వీసు చైర్‌పర్సన్‌గా కంఠమణి రామకిషోర్, మార్కెటింగ్ కమ ఉ్యనికేషన్ చైర్‌పర్సన్‌గా మద్దుకూరి రవి ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లగా ఎన్నుకొనట్లు లయన్ వీర వెంకట సత్యానారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు జయరాజు

పూర్వ విద్యార్థుల కలయిక



చిన్నాయగూడెంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెంకు చెందిన 1976 నాటి పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. సుమారు 50 ఏళ్ల తర్వాత ఈ అపూర్వ కలయిక ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వ విద్యార్థులంతా కలసి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని యోగక్షేమాలను ముచ్చటించుకున్నారు. పూర్వ విద్యార్థి పిన్నమనేని వెంకటరామారావు ఇంటి వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

సొంత సొమ్ముతో మట్టి తొలగింపు

దేవరపల్లి: దేవరపల్లి–గౌరీపట్నం గ్రామాల మధ్య సుమారు 10 కిలోమీటర్ల రహదారికి ఇరువైపులా మట్టి పేరుకుపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పరిస్థితి గమనించిన మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పైడిమళ్ల పోసి మానవతా దృక్పథంతో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి తొలగించేందుకు దేవరపల్లి నుంచి గౌరీపట్నం మేరీమాత పుణ్యక్షేత్రం వరకు రెండు బ్లేడ్ ట్రాక్టర్లతో మట్టి తొలగింపు పనులను సుమారు రూ. 40 వేలు తన సొంత సొమ్ము ఖర్చు చేసినట్టు ఆయన తెలిపారు. సీఐ బీఎన్ నాయక్, ఎస్సై సుబ్రహ్మణ్యం అభినందించారు.



దేవరపల్లి-గౌరీపట్నం మధ్య రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వానికి పుట్టగతులుండవు

- యువత పోరును విజయవంతం చేయాలి
- అబద్ధపు వాగ్దానాలతో దగా

చాగల్లు: పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసినట్టు యువత, నిరుద్యోగులను కూడా మోసం చేస్తే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని వైఎస్సార్‌సీపీ కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండిపడ్డారు. యువతను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేందుకు వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం చేపట్టనున్న యువత పోరు ధర్నాను విజయవంతం చేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం చాగల్లు మండలం మార్కొండపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు అన్ని వర్గాలనూ దగా చేస్తున్నారన్నారు. మోసపోతున్న యువతకు అండగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా ఇంత వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఏడాదిగా ఉద్యోగాలు కల్పించకుండా ఉన్న ఉద్యోగులను తొలగిస్తూ, యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడుతూ పోరాటాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణుల పట్ల ప్రభుత్వం అక్రమ కేసులను బనాయిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు.

ఐక్యంగా ప్రభుత్వాన్ని నిలదీద్దాం

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ నెల 23న రాజమండ్రిలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు, లేని పక్షంలో నిరుద్యోగ భృతి, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామని అబద్ధపు వాగ్దానాలు చేసి యువతను చంద్రబాబు మోసం చేశారన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా యువతకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయం, వైద్య రంగంలో లక్షలాది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం మాటలతోనే కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో అంతా పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, పార్టీ జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షులు ఇంటి వీర్రాజు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉండవల్లి శ్రీనివాస్, సర్పంచ్ కుదప రాంబాబు, తాళ్లూరి సత్యానారాయణ, ఎస్‌కె పాషా, అయినం నాగరాజు, పి. రాఘవ, పొన్నాడ సింహాద్రి, పి. కోటీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మార్కొండపాడులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు, యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్‌బాబు

కూటమి మోసాలు ఎండగడతాం

గోపాలపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ప్రజలను మోసం చేసుకుంటూ వస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్రమోడీల మోసాలను ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ ప్రజలకు మద్దతుగా పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ ముచ్చికర్ల రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సోమవారం చేపట్టిన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు నిరుద్యోగ యువతీ యువకులు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నిరుద్యోగుల పక్షాన నిలబడి ఎన్నికల మేనిఫెస్టోని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువత పోరు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



ముచ్చికర్ల రవి

శుభకార్యాలకు హాజరైన తలారి

చాగల్లు: మండలంలోని చాగల్లు, మార్కొండపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల ఇంట జరిగిన పలు శుభకార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. చాగల్లులో కంకటాల సర్వేశ్వరరావు, అనంతలక్ష్మి దంపతులు కుమార్తె ఓణీల వేడుకలో స్థానిక నాయకులతో కలిసి సందడి చేశారు. అనంతరం మార్కొండపాడులో మండల పరిషత్ అధ్యక్షుడు మట్టా వీరాస్వామి సోదరుడు వెంకటేశ్వర్లు కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి సూరిబాబు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉండవల్లి శ్రీనివాస్, సర్పంచ్ కుదప రాంబాబు, తాళ్లూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మార్కొండపాడులో శుభ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తలారి, నాయకులు

ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన జిల్లా జూనియర్ బాలుర జట్టు



బాలికల జట్టు

దేవరపల్లి: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల విభాగాలకు జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన బాలుర, బాలికల జట్లు ఈ నెల 24న ఒంగోలులో జరగనున్న జోనల్ స్థాయి పోటీలకు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మేనేజరు అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్, ఫిజికల్ డైరెక్టర్ ఓరుగుంటి నాగరాజు, రామకృష్ణంరాజు, చాగల్లు పీడీ కేతా రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.